రోడ్లపైకి చెత్త రాకుండా చూస్తున్నాం



చెత్తను కార్మికులకు అందించాలని తెలుపుతున్న కమిషనర్‌

బండ్లగూడ: రోడ్లపైకి చెత్త రాకుండా ప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తూ చెత్త ఆటో కార్మికులకు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్‌ కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌ చంద్ర సూచించారు. బుధవారం 5,15,16 డివిజన్‌లలోని సాయి రాంనగర్‌ కాలనీ, కపిలనగర్‌, లక్ష్మీనగర్‌ కాలనీలలో తడి, పొడి చెత్త సేకరణను ఆయన పరిశీలించారు. తమ ఇంటి వద్దకు వచ్చే చెత్త సేకరణదారులకు చెత్తను అందించాలని, రోడ్లకు ఇరువైపులా, ఖాళీ ప్రదేశాల్లో చెత్తను వేయవద్దన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ నరేష్‌, శానిటరీ జవాను కృష్ణ, వెంకటేష్‌, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కొరివి కృష్ణస్వామి ముదిరాజ్‌సేవా సమితి అధ్యక్షుడిగా నరేందర్‌



రాయదుర్గం: కొరివి కృష్ణస్వామిముదిరాజ్‌ సేవా సమితి శేరిలింగంపల్లి అధ్యక్షుడిగా నీలం నరేందర్‌కుమార్‌ ముదిరాజ్‌ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర అధ్యక్షుడు తొండెతి సత్యం ముదిరాజ్‌ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా నరేందర్‌ ముదిరాజ్‌ మాట్లాడుతూ సమితి రాజకీయపార్టీ కాదని, కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితమన్నారు. విద్యా, వైద్య, ఉపాధి, విగ్రహావిష్కరణ లక్ష్యాలుగా సమితి పనిచేస్తుందని తెలిపారు. శేరిలింగంపల్లి ప్రాంతంలో పలు కార్యక్రమాలను చేపట్టేందుకు తగిన చొరవ తీసుకుంటామన్నారు. రాష్ట్ర స్థాయి కార్యవర్గంతోపాటు 119 నియోజకవర్గాల అధ్యక్షులు, ఇన్‌చార్జీలను నియమించినట్లు తెలిపారు.

బీజేపీలో చేరిక



బీజేపీలో చేరిన వారితో గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: గచ్చిబౌలి డివిజన్‌లో బీజేపీకి ఆదరణ పెరుగుతోందని గచ్చిబౌలి కార్పొరేటర్‌ గంగాధర్‌రెడ్డి అన్నారు. గచ్చిబౌలి డివిజన్‌, గోపన్‌పల్లికి చెందిన నాయకులు మునియప్ప, శంకర్‌, రాజు, మానస్‌, కరుణాకర్‌, విఠల్‌ ఆధ్వర్యంలో పలువురు యువకులు బుధవారం బీజేపీలో చేరారు. గంగాధర్‌రెడ్డి వారికి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ చేపడుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను చూసి పలువురు బీజేపీలో చేరుతున్నారన్నారు. సంక్షేమ పథకాల అమలులో కేంద్ర ప్రభుత్వం అందరికీ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధే అజెండాగా ముందుకు సాగుతున్న బీజేపీ ఎదుర్కొనే సత్తా ఏ పార్టీకి లేదన్నారు. బీజేపీలో అన్ని వర్గాల వారికి సముచిత స్థానం కల్పిస్తామన్నారు. కొత్త, పాత నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్య క్రమంలో నాయకులు శేఖర్‌, రమేష్‌, రాజు, గోపాల్‌, ప్రభాకర్‌, సురేష్‌, రాజు, నగేష్‌, వెంకట్‌, మణి, శ్రీకాంత్‌, వినయ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవారికి అండగా నిలవాలి



వయనాడ్‌కు మందులను తరలిస్తున్న రవికుమార్‌ తదితరులు

రాయదుర్గం: దేశంలో ఎక్కడా ఎలాంటి విపత్తులు వచ్చినా బాధితులకు అండగా నిలవాల్సిన బాధ్యత అందరిపై ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్‌ అన్నారు. బుధవారం స్వామి వివేకానంద మెడికల్‌ మిషన్‌ ద్వారా వాయనాడ్‌ వరద బాధితులకు స్వామి వివేకానంద యూత్‌ అధ్యక్షుడు నందనం విష్ణుదత్‌ ఆధ్వర్యంలో మసీదు బండ నుంచి ప్రత్యేక వాహనంలో మందులను పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనదేశం, మన ప్రజలు అనే భావనతో ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలన్నారు. వరదలతో సర్వం కోల్పోయిన వారికి తమ వంతు చేయూత అందించేందుకు అందరూ స్వచ్ఛందంగా ముందుకురావాలన్నారు. వయనాడ్‌ బాధితులకు ఔషధాలు అందించేందుకు చొరవ చూపిన , విష్ణు, త్రివేణి విద్యాసంస్థలు, లేపాక్షి కళాశాల యాజమాన్యాలను ఆయన అభినందించారు. కార్యక్రమంలో విజయ్‌, అరుణ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలే నరేంద్ర జయంతి

గోల్కొండ: ఆలే నరేంద్ర జయంతి వేడుకలను బుధవారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నామ యాదగిరినేత, ముఖేశ్‌, శివ రాజ్‌యాదవ్‌, శ్రీకాంత్‌సాగర్‌, కెప్టెన్‌ యాదగిరి, శివాజీ తదితరులు ఉన్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అత్తాపూర్‌: జీవితంపై విరక్తి చెంది ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన అత్తాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ ప్రభాకర్‌ తెలిపిన వివరాల ప్రకారం.. అత్తాపూర్‌ గ్రామానికి చెందిన ఒగ్గు వెంకటేష్‌(50) పెట్రోల్‌ పంపులో పనిచేస్తూ భార్య, పిల్లలతో జీవిస్తున్నాడు. ఇటీవల అతని భార్య మృతి చెందడంతో వెంకటేష్‌ రెండవ వివాహం చేసుకున్నాడు. మొదటి భార్య పెద్ద కుమారుడు నేవీ ఉద్యోగంలో సెలెక్‌ కాగా, అధికారులు డబ్బులు అడగడంతో డబ్బులు లేనిది ఉద్యోగం రాదని నిరాశతో అతను సూసైడ్‌ చేసుకున్నాడు. మరో కుమారుడు పెళ్లి చేసుకుని వేరే కాపురం పెట్టాడు. రెండవ భార్య తన కుమారుడుని తీసుకుని వెంకటేష్‌తో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన వెంకటేష్‌ మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా జనరల్‌ ఆసుపత్రిలో శవపరీక్ష అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు.



కేజీ.దొడ్డి-రాయన్నగూడ మధ్యలో ఏర్పడిన గుంతలు

రహదారికి మోక్షమెప్పుడో..?

అర్ధాంతరంగా నిలిచిన విస్తరణ పనులు



ఇరువైపులా రోడ్డును తవ్విన దృశ్యం

శంషాబాద్‌ రూరల్‌: రహదారి విస్తరణ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. మట్టి రోడ్డుపై గుంతలు పడి వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని కేబీ.దొడ్డి–రాయన్నగూడ గ్రామాల మధ్యలో రహదారి పనులు అసంపూర్తిగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. శంషాబాద్‌–మొయినాబాద్‌ మండలాలను అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేస్తున్న ఈ రహదారి పనులు ఏళ్ల నుంచి కొనసాగుతున్నాయి. బీజాపూర్‌ రహదారి నుంచి శంషాబాద్‌ రహదారి వరకు సుమారు 10 కి.మీటర్ల వరకు రోడ్డును విస్తరించారు.

కోర్టులో వివాదం..

కేబీ.దొడ్డి నుంచి రాయన్నగూడ వరకు రోడ్డు పనులు నిలిచిపోయాయి. పట్టాదారులు నష్టపరిహారం కోసం కోర్టుకు వెళ్లి స్టే తీసుకొచ్చారు. దీంతో విస్తరణ పనులను ఈ ప్రాంతంలో నిలిపివేసి.. మిగతా పనులు పూర్తి చేసి రెండేళ్ల అవుతుంది. నిలిచిన పనులను పూర్తి చేయడానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

భారీ గోతులు..

రోడ్డు విస్తరణ కోసం గతంలో ఉన్న బీటీ రోడ్డును తొలగించారు. దీంతో పాటు ఇరువైపులా రోడ్డును తవ్వి వదిలేయడంతో, మట్టి రోడ్డుపై వర్షానికి నీరు నిలిచి గుంతలు ఏర్పడుతున్నాయి. భారీ గోతుల కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురైతున్నారు. ఏడాది కిందట గుంతల్లో మట్టి నింపి చదును చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో గుంతలు ఏర్పడి రోడ్డు ఎప్పటిలాగానే మారిపోయి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఈ మార్గంలో నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. శంషాబాద్‌ మండల పరిధిలో ఉన్న పారిశ్రామికవాడతో ఈ మార్గంలో భారీ వాహనాల రాకపోకలు పెరిగిపోయాయి. దీంతో స్థానికులతో పాటు వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

ఎంజీఐటీలో అబ్రాడ్‌ ఫెయిర్‌



విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేసిన యూనివర్సిటీల ప్రతినిధులు

మణికొండ: విదేశాలలో ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఎదురయ్యే సమస్యలను తెలుసుకుని జాగ్రత్త పడటంతో పాటు ఉన్నత విద్యా సంస్థలలో విద్యను అందుకునేందుకు అవసరమైన వన్‌డే ఆన్‌ క్యాంపస్‌ స్టడీ అబ్రాడ్‌ ఫెయిర్‌ను గండిపేటలోని మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్‌ ఆఫ్‌ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలలో బుధవారం నిర్వహించారు. అమెరికా, జర్మనీ, ఫ్రాన్స్‌, ఐర్లాండ్‌, కెనడా లాంటి దేశాలలో ఉన్న 25 విశ్వవిద్యాలయాల ప్రతినిధులు విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేశారు. కళాశాలలోని కెరీర్‌ గైడెన్స్‌ సెల్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ జి.చంద్రమోహన్‌రెడ్డి, వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కె.సుధాకర్‌రెడ్డి, సీజీసీ చైర్మన్‌ డాక్టర్‌ సీయస్‌ శ్రీనివాస్‌లతో పాటు విదేశీ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు పాల్గొన్నారు.

యూజీ కోర్సుల ప్రవేశాల కోసం గడువు పెంపు

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నరసింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, శ్రీకొండా లక్ష్మణ్‌ ఉద్యాన విశ్వవిద్యాలయంలో వివిధ యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు తేదిని ఈ నెల 29 వరకు పొడిగించారు. విద్యార్థుల తల్లిదండ్రుల విజ్ఞప్తి మేరకు బైపీసీ స్ట్రీమ్‌ కోర్సుల్లో దరఖాస్తు చేసుకునే తేదిని పెంచినట్లు ప్రొఫెసర్‌ జయశంకర్‌ వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌ పి రఘురామిరెడ్డి తెలిపారు. ఈ గడువు ఆగస్టు 17వరకు ఉండేదని, చాల మంది విద్యార్థులు వివిధ కారణాల వలన దరఖాస్తులు చేసుకోని కారణంగా ఈ గడువును పెంచినట్లు తెలిపారు. తొలివిడుతలో దరఖాస్తు చేసుకోని వారు ఇప్పుడు దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాల కోసం విశ్వవిద్యాలయం వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు.

వర్షాకాలంలో రోడ్డు నిర్మాణాలు.. నాణ్యత లోపిస్తే చర్యలు





తవ్వి వదిలేసిన రోడ్లపై వర్షపునీరు నిలిచిన దృశ్యం

అత్తాపూర్‌: హైదర్‌గూడ 16 షెటర్లు నుంచి ఉప్పరపల్లి రాజేంద్రనగర్‌ ఎనిమిదవ మెట్రో పాలిటిన్‌ కోర్టుకు వెళ్లే ప్రధాన రహదారి మార్గం కాంట్రాక్టర్లు తవ్వేశారు. సకాలంలో రోడ్డు మార్గాన్ని పూర్తి చేయాల్సిన వారు నిర్లక్ష్యం చేయడంతో ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్డు మార్గం చిత్తడిగా మారిపోయింది. దీంతో రహదారి గుండా వెళ్లేవారు తీవ్ర ఇబ్బందులకు గురైతున్నారు. వర్షకాలంలో రోడ్ల నిర్మాణాలు చేపడితే నాణ్యత లోపిస్తుందని, ఈ సమయంలో రోడ్ల నిర్మాణాలు ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. గ్రేటర్‌ హైదరాబాద్‌ మున్సిపల్‌ కమిషనర్‌ ఆమ్రపాలి నగరంలో జరుగుతున్న కాంట్రాక్టర్ల పనితీరుపై విరుచుకుపడ్డారు. చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులలో నాణ్యత ప్రమాణాలు లోపిస్తే ఆ కాంట్రాక్టర్‌ను రద్దు చేస్తామని హెచ్చరించారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ స్కీమ్‌ కోసం దరఖాస్తులు

బండ్లగూడ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలో ఎల్‌ఆర్‌ఎస్‌ స్కీమ్‌ కోసం దరఖాస్తులను స్వీకరిస్తున్నామని కార్పొరేషన్‌ కమిషనర్‌ బి.శరత్‌చంద్ర సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఎల్‌ఆర్‌ఎస్‌ స్కీమ్‌ కోసం దరఖాస్తుదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. స్కీమ్‌లో ఏదైనా సమాచారం కోసం లేదా సమస్యలు ఉంటే కార్పొరేషన్‌ టోల్‌ ఫ్రీ నెంబర్‌ 9121106519లో లేదా కార్పొరేషన్‌ కార్యాలయంలో స్పందించాలని కోరారు.

డీజీపీని సన్మానించిన మేయర్‌



డీజీపీ జితేందర్‌ను సన్మానిస్తున్న మేయర్‌ లతాప్రేమ్‌గౌడ్‌

బండ్లగూడ: మున్సిపల్‌ కార్పొరేషన్‌ హిమాయత్‌ సాగర్‌లోని తెలంగాణ పోలీస్‌ అకాడామీని సందర్శించిన డీజీపీ జితేందర్‌ను కార్పొరేషన్‌ మేయర్‌ లతాప్రేమ్‌గౌడ్‌ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జితేందర్‌ను శాలువాతో సత్కరించి మొక్కను అందజేశారు.

24న రౌండ్‌ టేబుల్‌ సమావేశం

యాకుత్‌పురా: న్యాయవాదులపై జరుగుతున్న దాడులు, అడ్వకేట్స్‌ ప్రొటెక్షన్‌ యాక్ట్‌పై చర్చించేందుకు ఈ నెలా 24 న రౌండ్‌ టేబుల్‌ సమావేశం నిర్వహించనున్నట్లు హైదరాబాద్‌ జిల్లా సిటీ సివిల్‌ కోర్టు బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు వై. శ్రీనివాసా చారి పేర్కొన్నారు. పురానీహవేలీలోని సిటీ సివిల్‌ కోర్టులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో సంబంధిత వాల్‌ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదులపై దాడులకు పాల్పడిన పోలీసులపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సివిల్‌ కోర్టులో శనివారం ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి రాష్ట్రంలోని అన్ని జిల్లా బార్‌ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, బార్‌ కౌన్సిల్‌ చైర్మన్‌, కార్యవర్గ సభ్యులు, న్యాయవాద ఎంపీలు, ఎమ్మెల్యేలు, వివిధ రాజకీయ పార్టీల లీగల్‌ సెల్‌ కన్వీనర్లు, న్యాయ నిపుణులు హాజరు కావాలని కోరారు. సమావేశంలో బార్‌ అసోసియేషన్‌ కే. ఉపాధ్యక్షురాలు ప్రవీణా రెడ్డి, ప్రధాన కార్యదర్శి డీ. హర్షవర్ధన్‌, సంయుక్తా కార్యదర్శి బర్కా రాజేశ్‌ కుమార్‌, కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సెప్టెంబర్‌ 1న భజన పోటీలు

గోల్కొండ: భజన భారతీ, భాగ్యనగర్‌ గణేశ్‌ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సెప్టెంబర్‌ 1న భజన పోటీలు నిర్వహించనున్నట్లు సమితి ప్రతినిధి జొన్నకుంటి మధుసుధన్‌ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుడిమల్కాపూర్‌లోని రాంసింగ్‌పురాలో గల బీకే భవన్‌లో ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభవుతాయని పేర్కొన్నారు. పురుషులు, మహిళలు, పిల్లలతో పాటు గానం, నృత్య బృందాల కోసం పోటీలు ఉంటాయని, ఒక్కో బృందంలో ఐదుగురికి తక్కువ కాకుండా 20 మందికి మించకుండా ఉండాలన్నారు. పాల్గొనే బృందాలు తమతమ వాయిద్యాలను వెంట తీసుకురావచ్చని ఒక్కో బృందానికి 10 నిమిషాల సమయం కేటాయిస్తామని తెలిపారు. పోటీలు తెలుగు, హిందీ భాషల్లోనే ఉంటాయని, పూర్తి వివరాలకు 9398822069, 9493967399 నంబర్‌లో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

చదువుతో పాటు సామాజిక బాధ్యత నేర్పించాలి



చాంద్రాయణగుట్ట: పిల్లలకు చదువుతో పాటు సామాజిక బాధ్యత నేర్పించాలని ఫలక్‌నుమా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ కే ప్రవీణ్‌ కుమార్‌ అన్నారు. తెలంగాణ సిటీజన్‌ కౌన్సిల్‌ ఆధ్వర్యంలో కళాశాలలో కోల్‌కతాలో లైంగిక దాడి, హత్యకు గురైన ట్రైనీ వైద్యురాలికి శ్రద్ధాంజలి కార్యక్రమాన్ని బుధవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నిందితులను ఫాస్ట్‌ ట్రాక్‌ కోర్టు ద్వారా విచారించి కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగ్రాం ఆఫీసర్‌ డాక్టర్‌ ఎల్‌.శశికళ, సిటీజన్‌ కౌన్సిల్‌ పాతబస్తీ అధ్యక్షుడు ఎస్‌.రామకృష్ణ శాస్త్రీ, చీఫ్‌ కో–ఆర్డినేటర్‌ ముత్యం యాదవ్‌, అధ్యాపకులు డేవిడ్‌, గంగాధర్‌, కాంగ్రెస్‌ గ్రేటర్‌ ఓబీసీ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

6600 ఎల్‌ఆర్‌ఎస్‌ దరఖాస్తులు తిరస్కరణ



శంషాబాద్‌ మున్సిపాలిటీ కార్యాలయం

శంషాబాద్‌: జీవో 111 నిబంధనలు తొలగిస్తారే మోనని గంపెడాశలతో ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న శంషాబాద్‌ వాసులకు చేదు అనుభవమే ఎదురవుతోంది. జీవో 111 పరిధిలో దరఖాస్తు చేసుకున్న ప్రతి దరఖాస్తును అధికారులు తిరస్కరిస్తున్నారు. మున్సిపాలిటీలో ఎల్‌ఆర్‌ఎస్‌ ప్రక్రియ కోసం మొత్తం 6791 మంది దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఇటీవల ఎల్‌ఆర్‌ఎస్‌ ప్రక్రియను వేగవంతం చేయడంతో మున్సిపాలిటీ, రెవిన్యూ, ఇరిగేషన్‌ అధికారులతో కలిపి మొత్తం మూడు బృందాలను ఏర్పాటు చేసి ప్రక్రియను వేగవంతం చేశారు.

సాతంరాయి మినహా..

పట్టణంలోని మిగతా ప్రాంతం నుంచి పెద్ద ఎత్తున వచ్చిన దరఖాస్తులన్నీ కూడా తిరస్కరణకు గురైతున్నాయి. సాతంరాయి నుంచి వచ్చిన సుమారు 200 లోపు దరఖాస్తులు మాత్రం ఎల్‌ఆర్‌ఎస్‌ ప్రక్రియ జరుగుతోంది. తిరస్కరణ జాబితాలో మొత్తం 6600 దరఖాస్తులు ఉన్నట్లు అధికారులు స్పష్టం చేస్తున్నారు.

మార్గదర్శకాలు మారలే..

గత సర్కారు హయాంలో జీవో 111కు ప్రత్యామ్నాయంగా జీవో 69 జారీ చేసినప్పటికి జీవో 111లో ఉన్న నిబంధనలు యధాతథంగా ఉన్నాయి. నిబంధనల్లో మార్పులు కానీ కొత్త మార్గదర్శకాలు కానీ జారీ చేయలేదు. 9 నెలలుగా ప్రస్తుతం ప్రభుత్వం దీనిపై ఎలాంటి కీలక నిర్ణయం తీసుకోకపోవంతో పరిస్థితి యధాతథంగానే ఉంది. దీంతో జీవో 111 పరిధిలో ఉన్న ప్లాట్ల యజమానులు క్రమబద్ధీకరణ చేసుకోవాలనుకున్న ఆశలు అడియాసలే అయ్యాయి.

అన్ని పరిశీలించాల్సిందే..

తిరస్కరణ జాబితాలో ఉన్న వాటిని కూడా పరిశీలించాల్సిందిగా ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో మున్సిపాలిటీలో ఆరువేల పైచిలుకు దరఖాస్తులన్నింటని క్షేత్రస్థాయిలోకి వెళ్లి అధికారులు పరిశీలించాల్సివస్తోంది. జీవో 111 పరిధిలోని దరఖాస్తులను క్రమబద్ధీకరణ చేయనప్పటికి వాటిని క్షేత్ర స్థాయి పరిశీలన ఎందుకు చేయిస్తున్నారనేది ప్రశ్నగా మారుతోంది. ఎల్‌ఆర్‌ఎస్‌ ప్రక్రియ పూర్తిగా రాష్ట్ర స్థాయి ముఖ్య అధికారులు ఆధ్వర్యంలో కొనసాగుతుండడంతో తిరస్కరణకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలనపై పురపాలకశాఖ ఇంకా ఎటూ తేల్చుకోలేని స్థితిలో ఉంది.

యువజన సంఘం ఆధ్వర్యంలో భారత్‌ బంద్‌



భారత్‌ బంద్‌లో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్‌: భారత్‌ బంద్‌లో భాగంగా రాజేంద్రనగర్‌ అంబేద్కర్‌ యువజన సంఘం బుధవారం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున దళిత సంఘాల నాయకులు అంబేద్కర్‌ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బంద్‌లో పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో కొన్ని దుకాణాలను ప్రభుత్వ పాఠశాలలను సైతం మూసి వేయించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు సుప్రీంకోర్టు వెంటనే ఎస్సీ వర్గీకరణపై పునరాలోచించి రద్దు చేయాలని కోరారు. ఈ బంద్‌ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులు, ఎస్‌సీఆర్‌పీ సొసైటీ జిల్లా అధ్యక్షులు గొడుగు సంజీవ, అంబేద్కర్‌ సంఘం ప్రెసిడెంట్‌ పచ్చ నర్సింగ్‌రావు, జయంతి కమిటీ చైర్మన్‌, అంబేద్కర్‌ సంఘం జనరల్‌ సెక్రటరీ ప్రసాద్‌, సన్నీ, నందు, అజయ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'సంస్కృత భాషా దినోత్సవం'





సంస్కృత భాషా దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌ స్కూల్‌లో 'సంస్కృత భాషా దినోత్సవం' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం క్యాంపస్‌ స్కూల్‌ సంస్కృత టీచర్‌ డాక్టర్‌ లంకపార్థ సారథి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్కృత భాషపై విద్యార్థులకు మరింత అవగాహన, ఆసక్తి పెంచేలా శ్లోకాలు, లఘునాటికలు, సంస్కృత గీతాల ఆలాపన తదితర కార్యక్రమాలతో ఆద్యంతం ఎంతో ఉత్సాహభరితంగా సాగింది. సంస్కృత భాషను వివరిస్తూ విద్యార్థులు ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో క్యాంపస్‌ స్కూల్‌ ప్రిన్సిపాల్‌ పి మురళి మాట్లాడుతూ అన్ని భాషలకు తల్లిభాషగా సంస్కృత భాష గుర్తింపు పొందిందన్నారు. ఒకప్పుడు రాష్ట్ర భాషగా, వ్యవహార భాషగా కూడా గుర్తింపు ఉండేదని గుర్తు చేశారు. కంప్యూటర్‌కు అనుగుణమైన ఏకైక భాష సంస్కృత భాష, మన సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ సంస్కృత భాషలోని నిక్షిప్తమై ఉన్నదని ఇలాంటి తల్లి భాషను మనం మర్చిపోకూడదన్నారు. శ్లోకాలు, లఘునాటికలు, సంస్కృత గీతాల ఆలాపన చేసిన విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

చాంద్రాయణగుట్ట: ఉస్మానియా మెడికల్‌ కళాశాల ఎంబీబీఎస్‌ గిరిజన విద్యార్థుల స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘం నాయకుడు సభావత్‌ గిరిధర్‌ నాయక్‌ కోరారు. ఈ మేరకు విద్యార్థులతో కలిసి జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కోటాజీని బుధవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడేళ్ల నుంచి స్కాలర్‌షిప్‌లు విడుదల కాకపోవడంతో ఫీజులు కట్టలేక ఇబ్బందులకు పడుతున్నారన్నారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపారు. ఆయన వెంట విద్యార్థులు బనావత్‌ తిరుపతి, ఆంగోతు మధుకర్‌ ఉన్నారు.

జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ను కలిసిన ఎమ్మెల్యేలు



బల్దియా కమిషనర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కౌసర్‌, ముబిన్‌

గోల్కొండ: కార్వాన్‌ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ కోరారు. బహదూర్‌పురా ఎమ్మెల్యే ముబిన్‌తో కలిసి బుధవారం జీహెచ్‌ఎంసీ కమిషనర్‌ ఆమ్రపాలిని కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ పైపులైన్ల పనులు వెంటనే పూర్తి చేయాలని, అలాగే వీధిలైట్ల నిర్వహణ కూడా అధ్వానంగా ఉందన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని బల్దియా కమిషనర్‌ హామీ ఇచ్చారని ఆయన తెలిపారు.

'మాల సంఘాల తీరు సరికాదు'

చాంద్రాయణగుట్ట: సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన తీర్పును అవహేళన చేస్తూ మాల సంఘాలు భారత్‌ బంద్‌కు దిగడం సరైంది కాదని బీజేపీ భాగ్యనగర్‌ జిల్లా ఉపాధ్యక్షుడు, దళిత చైతన్య వేదిక సభ్యుడు జాలిగం చిరంజీవి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వర్గీకరణ జరిగితే 59 ఉప కులాలకు సమన్యాయం జరుగుతుందన్నారు. మంద కృష్ణ చేసిన పోరాటంలో న్యాయం ఉందని అందుకే ప్రధాని నరేంద్ర మోడీ కూడా మద్దతు పలికారన్నారు.